నవతెలంగాణ
1
మహబూబ్‌నగర్
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

జిల్లా ఆస్పత్రిలో..
ట్రాన్స్ జెండర్ క్లినిక్ ప్రారంభం



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

రాష్ట్ర వ్యాప్తంగా మైత్రి క్లినిక్ ఎల్ (ట్రాన్స్ జెండర్ క్లినిక్) ప్రారంభం సందర్భంగా సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో రెవెన్యూ అదన కలెక్టర్ మోహన్‌రావు ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్ కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్ (ట్రాన్స్ జెండర్ క్లినిక్) నులో ఆయన మాట్లాడుతూ మైత్రి క్లినిక్ ద్వారా కౌన్సెలింగ్ (ఆరోగ్య / ఆరోగ్యతర), సాధారణ ఆరోగ్య సేవలు,లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స, సామాజిక అర్హత సేవలు, ఇతర క్లినికల్ / ల్యాబ్ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కృష్ణ , డాక్టర్ జరీనా, డా. శశికాంత్ , డా. భాస్కర్ నాయక్ - జరీనా, డా. నజ్మ, డా.స్వప్న , డా.విజయ్ శేఖర్ గ రాఘవేందర్ సూపరింటెండెంట్ వర ప్ర సాద్ , రాములు, హెల్త్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు , ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత జౌళిశాఖ వస్త్రప్రదర్శనను ..
ప్రారంభించిన అదనపు కలెక్టర్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా చేనేత జౌళి శాఖ సంచాలకుల ఆదేశాల ననుసరించి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన వస్త్ర ప్రదర్శన, అమ్మకాల స్టాల్‌ను జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 9 వరకు కొనసాగుతుందని, ఈ ప్రదర్శన లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చేనేత సహకార సంఘాలు ఉత్పత్తి చేసిన వివిధ రకాల వైవిధ్య వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు చేయ నున్నట్లు తెలిపారు.చేనేత వస్త్రాల ప్రదర్శన స్టాల్‌ను సందర్శించి వస్త్రాల కొను గోలు తో చేనేత కార్మికులను ప్రోత్సహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు బాబు, డీ.పీ.ఆర్.ఓ శ్రీనివాస్, బీ.సీ.సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, చేనేత జౌళి శాఖ ఏ.డీ.ఓ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీల ఎన్నిక





నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ దేవరకద్ర భూత్పూర్ మండలం మహాసభలు నిర్వహించి మండల కమిటీలు ఎన్నుకున్నారు. సోమవారం మండల మహాసభలు రాష్ట్ర కార్యదర్శి కే రవికుమార్ సీనియర్ నాయకులు కిష్టయ్య జిల్లా కోశాధికారి వీ భాస్కర్ సమక్షంలో దేవరకద్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శంకర్ ,ప్రధాన కార్యదర్శిగా కృష్ణయ్య ఉపాధ్యక్షులుగా పవన్ కుమార్ , అర్చన, కోశాధికారిగా రవీంద్రప్ప, కార్యదర్శులు లుగా జగదీశ్వర్, బాలమణి అబ్దుల్ రషీద్ జయకుమార్ తదితరులు ఎన్నుకున్నారు.

భూతపూర్ మండల కమిటీ ఎన్నిక...

మండల అధ్యక్షులుగా చెన్నోలి రాములు, ప్రధాన కార్యదర్శిగా కొప్పుల ఖాదరయ్, ఉపాధ్యక్షులుగాగోపాల్‌నాయక్ , విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యారంగం బలోపేతం చేసేందుకు కృషి చేస్తూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాభివృద్ధిలో ..
రామ్‌రెడ్డి సేవలు మరువలేనిది

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు అల్వాల్‌రెడ్డి



నవతెలంగాణ - మిడ్జిల్

మిడ్జిల్ గ్రామ అభివృద్ధిలో ఎల్లుగొండ రామ్ రెడ్డి పాత్ర మరువలేనిదని అని కాంగ్రెస్ మండల అధ్యక్షులు అల్వాల్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మాజీ సర్పంచ్ వెలుగొండ రామిరెడ్డి మిడ్జిల్ గ్రామ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. మిడ్జిల్ గ్రామ సర్పంచిగా ఎన్నికై గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రామ్ రెడ్డి సొంత వ్యవసాయ పొలాన్ని పేదల ఇండ్ల నిర్మాణ కోసం ఉచితంగా ప్రభుత్వానికి దానం చేశారని, గ్రామ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా మిడ్జిల్ గ్రా మ అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. 1936లో జన్మించి 2020లో మృతి చెందారు అని చెప్పారు. అనంతరం కుటు ంబ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలేసి ఘనంగా నివాళులర్పించారు. ఇంతకుముందుకు అని చిత్రపటానికి కుటుంబ సభ్యులతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగొండ రామ్ రడ్డి భార్య వినీత దేవి, కుటుంబ సభ్యులు వరుణ్ రెడ్డి, అనుప్ రెడ్డి, మాధవి, శాలిని, కాంగ్రెస్ జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, కాంగ్రెస్ మండల నాయకులు శంకర్ నాయక్, జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

5న సమ్మేళనం

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ఈ నెల 5న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, సీనియర్ సిటిజన్స్ ఫోరం, బహుజన రాజ్య సమితి, దళిత ఐక్య వేదిక, మైనారిటీ రిజర్వేషన్ పోరాట సమితి, అఖిల పక్ష కమిటీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా డిసెంబర్ 14న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగే సమూహ రాష్ట్ర సాహిత్య మహాసభల్లో భాగంగా.. గద్వాల్ లో కవి సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. లౌకిక, ప్రజాస్వామిక సహజీవన సౌందర్యం మన భారత సంస్కృతి అనీ భూస్వామ్య, రాచరిక అణచివేతల్లేని ప్రజా జీవన పరిరక్షణ కోసం కుల మతాల కతీతంగా ప్రాణాలొడ్డిన ఈ తెగువనే మన వీరతెలంగాణా తెహజీబ్‌అనీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నెలరోజులు జిల్లాలో పోలీస్ ఆక్ట్ అమలు

- ఎస్పీ .డీ జానకి

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు 02 డిసెంబర్ 2024 నుంచి 01 జనవరి 2025 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ డీ.జానకి, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్‌ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని పేర్కొన్నారు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను, జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం, రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం, లౌడ్ స్పీకర్ లు, డీజే లు వంటివి కూడా ఈ సమయంలో నిషేధంకే అని పేర్కొన్నారు. నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అవుతారని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

పారిశ్రామిక వాడ నుంచి..
తరలనున్న పరిశ్రమలు

- కొత్తవి రావు... పాత పరిశ్రమల తరలింపు ఆగవు
- పోలెపల్లి సెజ్ నుంచి శంశాబాద్‌కు తరలిన బస్సు నిర్మాణ కంపెనీ
- ఉమ్మడి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు రాని కంపెనీలు
- సద్దుమనగని లగచర్ల వివాదం





నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

కొండ నాలుకకు మందు వేస్తే... ఉన్న నాలుక ఊడినట్లుగా ఉంది పాలకుల విధానాలు. జిల్లాలో ఉన్న వనరులను ఉపయోగించుకొని పరిశ్రమలు ఏర్పాటు చేసి వేలాది మంది నిరుద్యోగులకు ఉపాది కల్పిస్తామని గతంలో పాలకులు



చెబుతూ.. వచ్చారు. కొత్త పరిశ్రమలు రాకపోగా పాత పరిశ్రమలు ఇక్కడి నుంచి జిల్లాను వదలి ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. బాలనగర్, రాజాపూర్, జడ్చర్ల, బూత్పూరు , పాలెం కొత్తకోట పరిధిలో పరిశ్రమలు ఈ 10 ఏళ్ల కాలంలో 50 కి పైగానే ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. లగచర్లలో ఫార్మ కంపెనీ ఏర్పాటుపై ఒకవైపు ఆందోళనలను జరుగుతుంటే మరో వైపు ఇథనాల్ కంపెనీ నిలిపేయాలని ఉద్యమాలు చేస్తున్నారు.పాలకుల విధానాలపై ఉమ్మడి జిల్లాలో ‹రుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జడ్చర్ల మండల పరిధిలోని పోలెపల్లి సెజ్‌లో ఉన్న బస్సు నిర్మాణ కంపెనీ ఇక్కడి నుంచి శంశాబాద్‌కు తరలిపోవడంతో వందలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. పరిశ్రమల స్థాపన కోసం మౌలిక వసతులు ఏర్పాటు చేసి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని పలు కార్మిక సంఘాలు కోరుతున్నాయి. 22 ఏళ్ల క్రితం అప్పటి సీఎం ఫార్మ కంపెనీల ఏర్పాటు కోసం శంశాబాద్ విమానాశ్రయానికి కూత వేటు దూరంలో జాతీయ రహదారి సమీపాన దాదాపు వేయి ఎకరాలను సెజ్ కోసం సేకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలెపల్లి గ్రామ పరిధిలో సెజ్‌ను ఏర్పాటు చేయడానికి నమ్మ బలికారు. అందులో వందలాది మంది బీసీలు, ఎస్సీ,ఎస్టీలు సాగు భూములు కోల్పోయారు. బంగారు కంటే విలువయిన ఈ భూమిని అప్పట్లో రూ. 16 వేలు ఎకరాక‹ ఇచ్చి స్వాధీనం చేసుకున్నారు. గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేస్తామని నోటిఫికేషన్ వేశారు. ఇందులో పోలెపల్లి, గుండ్లగడ్డతండా, ముదిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన సాగు భూములను స్వాధీనం చేసుకున్నారు. దీంతో 320 మంది రైతులు భూములు కోల్పోయి రోడ్డున పడ్డారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎకరాకు రూ. 40 లక్షలకు పారిశ్రామికులకు అమ్మజూస్తే... రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినా...తమ బిడ్డలకు ఉపాది లభిస్తోందని నమ్మి విలువైన సాగు భూములను సెజ్‌కు అప్పగించారు. ఇప్పుడా వెయ్యి ఎకరాలలో 32 కంపెనీలు ఏర్పాటు చేశారు. హెట్రో డ్రగ్స్, అరబిందోకు చెందినవి 5 యూనిట్లు, మహిళాన్ అంబిల్, సుప్రీం ప్లాసిక్ తదితర ముఖ్యమైన కంపెనీలున్నాయి. ముఖ్యంగా ఇక్కడ మేఘా బస్సుల కంపెనీ ఉండేది. ప్రతి రోజు నాలుగు బస్సులు తయారు అయ్యేవి. లగ్జరీ, సూపర్ ఎక్స్‌ప్రెస్, ఏసీ బస్సులు తయారయ్యేవి. ఈ కంపెనీలో మూడు షిఫ్టులలో 10 వేల మంది కార్మికులు పనిచేసేవారు.ఈ ఏడాది ఏప్రిల్‌లో శంశాబాద్‌కు తరలిఒచారు. మరో 50 ఎకరాలు కావాల‹ కంపెనీ యజమాన్యం అడిగింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఈ కంపెనీ తరలిపోయిందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కంపెనీ తరలిపోతున్నా.. ప్రభుత్వం నుంచి ఎటువంటి చర్యలు తీసుకోలేదని కార్మికులు వాపోతున్నారు. అరబిందో కంపెనీకి చెందిన యాజమాన్యం నీటి లభ్యత కోసం ఓ ప్రయివేటు రైతు పొలంలో బోరు వేసి పైపులైను ద్వారా నీటిని తరలించేవారు. తాజాగా అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే పైపు లైను ధ్వంసం చేసి నీటిని తరలించక‹ండా నిలి పేశారనే ఆరోపణలు లేకపోలేదు. ముఖ్యంగా బాలనగర్ కొత్తూరు పరిధిలో ఐరన్ , ప్లాస్టిక్ కంపెనీలు సైతం తరలిపోవడం వల్ల 10 వేల మంది ఉపాధి కొల్పోయారు.

కొత్తవి ఏర్పాటు చేయరు...పాతవి నిలబడవు

జిల్లాలో అపారమైన ముడిసరుకు మానవ వనరులు ఉన్నాయి. కృష్ణానది జాతీయ రహదారి రైల్వే , అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది.కలప, సున్నం, నూలు,కాగితం పరిశ్రమలతో పాటు వృత్తిపరమైన అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. కొత్తవి ఏర్పాటు చేయకపోగా ఉన్న వాటిని నిలబెట్టుకోలేక పోతున్నారు. ముఖ్యంగా కాలుష్యమైన ఇథనాల్ కంపెనీని మరికల్‌లో ఫార్మకంపెనీని లగచర్లలో మహబూబ్‌నగర్‌లో అమరరాజా, ప్రాణాంతకమైన పరిశ్రమలను నిర్మించడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యానికి పాలమూరు ప్రజలను బలిచేసే క‹ట్రలను జిల్లా ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం కాలుష్య రహిత పరిశ్రమలను ఏర్పాటు చేయడాకి ప్రోత్సహించి ఉపాది అవకాశాలు కల్పించాలని పలు పార్టీలు ప్రజలు కోరుతున్నారు. బాలనగర్, రాజాపూర్, జడ్చర్ల, కొత్తకోట పాలెం పరిధిలో దాదాపు 50 కంపెనీలు తరలిపోయి 25 వేల మంది రోడ్డున పడ్డారని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో లగచర్ల, పోలెపల్లే, దుద్యాల,రోటీబండతండా పరిధిలో ఫార్మ విలేజీ పేరుతో 1350 ఎకరాల సాగు భూ మిని సేకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఫార్మకంపెనీలు వస్తే.. గాలి, నీరు, భూమి కాలుష్యం అవుతుందని ఆ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయిన కూడా పరిశ్రమలు ఏర్పాటు చేయడం వెనక కుట్ర దాగి ఉందనే విమర్శలు వస్తున్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక వసూతులు కల్పించాలి..

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనేక అవకాశాలు ఉన్నాయి. ఏయిర్‌పోర్టు జాతీయ రహదారి భూములు, ముడిసరుకుతో పాటు మానవ వనరులు సైతం ఉన్నాయి. వీటిని ఉపయోగించుకోని పరిశ్రమల ఏర్పాటుకు కంపనీ యజమానులను ప్రోత్సహించాలి. ముఖ్యంగా ఇదివరకే స్థాపించిన కంపెనీలకు అవసరమైన వసతులు కల్పించాలి. సెజ్ పోలెపల్లిలో విస్తారమైన భూములు ఉన్నాయి. అడిగిన వారికి భూములు ఇచ్చి కంపెనీలు వచ్చే విదంగా ప్రోత్సహించాలని కోరారు.

- ఎన్. కురుమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

గురుకులాల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ...
రాజకీయాలు చేయడం సరికాదు

- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి



నవ తెలంగాణ - మహబూబ్‌నగర్

గురుకులాల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాజకీయాలు చేయడం సరికాదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో గురుకుల సెక్రటరీగా పనిచేసిన మీరు ఎంత నియంతలా వ్యవహరించారో ప్రపంచానికి తెలుసునని ఎద్దేవాచేశారు. ప్రతిభతో ఎంపికైన గురుకుల ఉపాధ్యాయులను మీరు ఎంతగా వేదించారో వాళ్లలో ఎవరిని అడి గినా చెబుతారని అన్నారు. అడ్డగోలుగా మీ అనునాయులకు వంట కాంట్రా క్టులు, కూరగాయాలు, వంట సామాగ్రి కొనుగోలు కాంట్రాక్టు ఇచ్చి అనధికా రికంగా సైన్యం ఏర్పాటు చేసింది. మీరు కాదా అని ప్రశ్నించారు. మీ హయా ంలో కొన్ని వందల సంఖ్యలో పురుగుల భోజనం, కనీసం స్నానం చేయడానికి సబ్బులు కూడా ఇవ్వలేదనే ఉదంతాలు ఎన్ని సార్లు బయటి రాలేదని, ఇప్పుడు మీరు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం రేవంత్రెడ్డి నేతృత్వంలో గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గురుకులాల్లో దాదాపు 15 వేలమందికి పదోన్నతులు, 11వేల మందిని కొత్త నియామకం చేసింది మీకు కనబడడం లేదా అని అన్నారు. మీరు సెక్రటరీగా ఉన్న సమయంలో కనీసం ఒక్కసారి కూడా మెస్ చార్జీలు పెంచలేదని, రేవంత్ రెడ్డి నేచుర్యంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లోనే 30 శాతం మెస్ చార్జీలు పెంచడం జరిగిం దన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి పిల్లలకు పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చి మెరుగైన భోజన అందిస్తుంటే ఓర్వలేకనే మీరు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రొటేషన్ పద్ధతిలో..
స్థానిక సమస్థల ఎన్నికలు నిర్వహించాలి

- దళితసంఘాల నాయకులు





నవతెలంగాణ - హన్వాడ

స్థానిక సమస్థల ఎన్నికలు రొటేషన్ పద్ధతిలో నిర్వహించాలని ఎంపీడీఓ యశోదమ్మాకు దళిత సంఘాల నాయకులు సోమవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బుద్ధా రామనిర్మాణం కమిటీ జిల్లా అధ్యక్షులు పట్టేపురం బాలకిష్టయ్య తెలంగాణ పంచాయతీ సర్వీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న, ఏమార్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంబూలయ్య మాట్లాడుతూ 2019లో నిర్వహించిన ఎన్నికల్లో నిర్వహించిన విదంగా రోస్టర్ పద్ధతి లో నిర్వహించాలని అన్నారు ఎక్కువ జనాభ ఉన్న వర్గాలకు మాత్రమే అవకాశాలు వస్తున్నాయని, తక్కువ జనాభ ఉన్న వర్గాలకు అవకాశాలు నష్టపోతున్నారని అన్నారు. అధికారులు రాస్ధాప్రభుత్వానికి మా వినతి పత్రాన్ని పంపాలని అన్నారు. హన్వాడ మండలం ఏర్పాటు అయినా తరువాత ఇప్పటి వరకు ఎస్సీ ఎస్టీ ల కు ఎంపీపీ , జెడ్పీటీసీ రిజర్వేషన్ రాలేదని ఆవేదన వక్తం చేశారు. జనాభ ప్రకారంగా రిజర్వేషన్ అమలు చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో రావులకిష్టయ్య, భీమయ్యవెంకటయ్య , ఎన్. శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు ప్రభుత్వంలో.. రైతులకే ప్రాధాన్యత

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి
- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం
- బాలానగర్ ఉమ్మడి మండలాన్ని మరో కోక పేటగా..





నవతెలంగాణ - బాలానగర్

రైతు ప్రభుత్వంలో రైతులకే ప్రాధాన్యత అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ మావేశ మందిర ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. బాలానగర్ ఉమ్మడి మండలం మార్కెట్ కమిటీ కమిటీ చైర్పర్సన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ వ్యవసాయ శాఖ అధికారి బాలమణి చైర్పర్సన్ అశ్వినీతో ప్రమాణస్వీకారోత్సవం చేయించారు. డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. బాలానగర్ ఉమ్మడి మండలంలో ప్రతి గిరిజన తండాకు వీటి రోడ్లు ఏర్పాటు చేస్తున్నానని అన్నారు. బాలానగర్ మండలానికి ఇండికేటర్ స్కూల్ మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2014లో 175 కోట్లు మంజూరు అయితే కేవలం రూ.91 కోట్లు తిరిగి వాపాస్ వెళ్లాయని అన్నారు. 2023. 24 కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 153 కోట్లు వచ్చాయని నీ టెండర్లు పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రతి గ్రామం నుంచి తండా వరకు వీటి రోడ్ల కోసం ఎక్కువ నిధులు తెస్తానని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలం వ్యవసాయ శాఖ చైర్ పర్సన్ గా గుమ్మల్ల అశ్విని ప్రమాణస్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా ఖానాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ గౌడు తోపాటు పలువురు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, రాజాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తెర కృష్ణయ్య, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ తిరుపతి, గుమ్మల వెంకటేశ్వర రెడ్డి. వెంకట్ రెడ్డి. రాజేశ్వర్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం

నవతెలంగాణ - జడ్చర్ల

జడ్చర్ల మండలం కిష్టారం గ్రామపంచాయతీ పరిధిలోని అంబటాపూర్ గ్రామానికి చెందిన రైతు తానం యాదయ్య ట్రాక్టర్ ప్రమాదంలో మరణించడం జరిగింది. మృతునికి భార్య ,కుమారుడు నితీష్. కుమార్తె నిహారిక,లు ఉన్నారు అతని కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు కిష్టారం గోపాల్ రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.





ఎంపీడీవో కార్యాలయంలో ..
నాట్యం చేస్తున్న నాగుపాములు

- భయాందోళనలో మహిళా ఉద్యోగస్తులు





నవతెలంగాణ - మిడ్జిల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వే కంప్యూటర్లో ఆన్‌లైన్ చేస్తుండగ రాత్రి సమయంలో ఎంపీడీవో కార్యాలయంలో నాగుపాములు కార్యాలయంలో నాట్యం చేయడంతో మహిళా ఉద్యోగస్తులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కులగరణ సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో రాత్రి,పగలు అని తేడ లేకుండా సెలవు దినాల్లో కూడా అధికారులు కంప్యూటర్లో నమోదు చేస్తుండగా కార్యాలయంలోకి నాగుపాములు రావడంతో మహిళా ఉద్యోగస్తులు ఆందోళన గురయ్యారు.ఉద్యోగస్తులు ప్రాణాలు అరచేతిలో పట్టు కొని విధులు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయం చుట్టూ చెత్త, కార్యాల యంలో పాత రికార్డులు, దుమ్ము దులితో ఎండిపోయి దుర్వాసన వెద జల్లుతుంది. ఎప్పుడు పాములు వచ్చి కాటు వేస్తాయని మహిళా ఉద్యోగస్తులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న నాగుపాములను పట్టుకొని ఫారెస్ట్‌లో వదిలిపెట్టాలని ఎంపీడీవో కార్యాల సిబ్బంది కోరుతున్నారు.

ఇండ్ల పరిహారంలో వివక్ష తగదు

- వ్య.కా.స.జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు



నవతెలంగాణ -వీపనగండ్ల

వర్షాకాలంలో కూలిన ఇండ్ల పరిహారం చెల్లింపులో వివక్ష తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో మాట్లాడుతూ వర్షా కాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో సుమారు 20 మట్టి మిద్దెలు కూలి పోయాయన్నారు. అందులో పెద్ద నరసింహ, గుంటి హనుమంతుకు చెందిన ఇండ్లు కూలిపోగా పరిహారం కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా వా రికి పరిహారం అందలేదన్నారు. కొంతమందికి పరిహారం చెల్లించి, కొంత మందికి చెల్లించకపో వడం ఏంటని ప్రశ్నించారు. అర్హులందరికీ పరిహారం చెల్లించాల్సిన అధికారులు వివక్ష చూపడం తగదన్నారు. జిల్లా అధికారులు పునర్ పరిశీలించి అర్హులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.స. గ్రామ అధ్యక్షుడు మదగం శ్రీనివాసులు, నాయకులు శంకర్ ఉన్నారు.

పారామెడికల్ కళాశాల రావడం సంతోషంగా ఉంది

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

నవతెలంగాణ- వనపర్తి రూరల్

వనపర్తి జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలతో, పాటు పారామెడికల్ కళాశాల రా వడం చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల భాగంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైదరాబాద్ నుండి పర్చవల్‌గా రాష్ట్రంలోని 16 నర్సింగ్,28 పారామెడికల్ కళాశాలలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదర్శ్ సురభి, వైద్య విద్యార్థులలో కలిసి ఆయన మెడికల్ కళాశాలలో వీక్షించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 28 పారా మెడికల్ కళాశాలలో వనపర్తి జిల్లాకు ఒక పారామెడికల్ కళాశాల మంజూరు అయిందని ప్రస్తుతం మెడికల్ కళాశాలలోని సోమవారం నుండి తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. పారామెడికల్ కోర్సులు ఈసీజీ విభాగంలో 10 మంది, అనస్తీసియా కోర్సులో 28 మంది, విద్యార్థులు ప్రవేశం పొందారని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సునందిని తెలిపారు.

పాఠశాల భవనం కోసం ..

కదంతొక్కిన విద్యార్థులు

- 20 కిలోమీటర్ల పాదయాత్ర
- రెండు గంటలపాటు కలెక్టరేట్ ఎదుట ధర్నా
- అధికారులు హామీ ఇచ్చినా కదలని విద్యార్థులు
- ప్రజాసంఘాల నాయకుల సంఘీభావం



రేమద్దుల నుంచి కాలినడకన జిల్లా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన విద్యార్థులు

నవతెలంగాణ- పాన్‌గల్

నాసిరంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలంటూ సోమవారం పాన్‌గల్ మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 20 కిలోమీటర్లు కాలినడకన జిల్లా కేంద్రానికి చేరుకొని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉదయం 9:30కి గ్రామం నుంచి బయలు దేరిన విద్యార్థులు మధ్యాహ్నం రెండున్నరకు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొన్ని ధర్నా నిర్వహించారు. వీరికి సీపీఎం పార్టీ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఏవో భానుప్రకాష్ విద్యార్థుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పినా విద్యార్థులు కలెక్టర్ మా సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని దాదాపు నాలుగు గంటల పాటు అక్కడే బైఠాయించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది మాట్లాడుతూ మూడు సంవత్సరాల కిందట గత ప్రభుత్వం మన ఊరు మనబడి కింద రేమొద్దుల గ్రామంలోని ఉన్నత పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేసిందన్నారు. కాగా కాంట్రాక్టర్ భవననిర్మాణాన్ని నాసిరంగా చేపట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు పనులు నిలిపి వేశారన్నారు. పాఠశాలలో 160 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వారికి సరిపడ తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడంతో విద్యార్థులు 20 కిలోమీటర్లు కాలినడకన వచ్చి తమ సమస్యను కలెక్టర్‌కు విన్నవించాలని వచ్చారన్నారు. కలెక్టర్ స్పందించి నాసిరకంగా అసంపూర్తిగా ఉన్న భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థి సంఘాలతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మహేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్ , ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, కవిత, సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటయ్య, ప్రజాసంఘాల నాయకులు ఎండి.ఖాజా, కమలాకర్, భాస్కర్ గౌడ్, మహేష్, లక్ష్మణ్, డి.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏవోకు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం



నవతెలంగాణ -వనపర్తి రూరల్

వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టోరెంట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామానికి చెందిన రైతు సాయిరెడ్డి తన భూమిని అన్నదమ్ములు సాగు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గతంలో పలు మార్లు ప్రజావాణిలో విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మనస్థాపానికి గురైన సాయిరెడ్డి సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సాయిరెడ్డిని చికిత్స నిమిత్తం వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాయిరెడ్డిని పరామర్శించి సంబం ధిత అధికారులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. సాయిరెడ్డికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

రైతు సంఘం నాయకుల పరామర్శ



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు సాయిరెడ్డిని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండి.జబ్బర్, జిల్లా అధ్యక్షుడు బాలిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.పరమేశ్వర చారి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వల్లే రైతు ఆత్మహత్యకు పాల్పడాడ్డన్నారు. వెంటనే సాయి రెడ్డి భూ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



నవతెలంగాణ -మదనాపురం

ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటించాలని డాక్టర్ రతన్ కుమార్ అన్నారు. మదనాపురం మండలం దుప్పల్లి గ్రామ సబ్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత చలి కాలంలో అనారోగ్య బారిన పడితే కోలుకోవడం కష్టమన్నారు. ముఖ్యంగా వృద్ధులు, బాలింతలు వైద్యులు చెప్పిన నియమాలను పాటించాలని సూచించారు. చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలన్నారు. చిన్నారులకు సరియైన సమయంలో టీకాలు వేయించాలన్నారు. అదేవిదంగా ఇంటింటి సర్వేలో పరీక్షలు చేయించుకోని ప్రజలు ఎవరన్నా ఉంటే వైద్య సిబ్బంది చేత పరీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీదేవి,ఆశా కార్యకర్తలు జిలేఖ బేగం, భాగ్య రాణి, సలీమా, శాయాది తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేర్ మండలం పాతపల్లి గ్రామానికి చెందిన కావాలి ఉసేన్ ఇటీవల పొలం వద్ద అడివి పంది తగిలి గాయ పడ్డడు. విషయం తెలుసు కున్న అదే గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల కార్యదర్శి ఎమ్.రవికుమార్ సోమవారం ఉసేన్‌ను పరామర్శించి వైద్య ఖర్చుల కోసం రూ. 5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి సాటి మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవాలని అలాంటి ఆలోచన విధానం అందరూ అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రి ఆక్సిజన్ ప్లాంట్ ప్రారంభం



నవతెలంగాణ -వనపర్తి రూరల్

ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఎంసిహెచ్ లలో ఆక్సిజన్ ప్లాంట్ లు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, ఎమ్మెల్యే మెఘా రెడ్డితో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వ్యవసాయ రంగంతో పాటు వైద్య ఆరోగ్య శాఖకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల లో భాగంగా జనరల్ ఆసుపత్రిలో 10 కేఎల్ కెపాసిటీ కలిగిన ఆక్సిజన్ ప్లాంటును, నర్సింగాయపల్లి దగ్గర గల ఎంసిహెచ్ ఆసుపత్రిలో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంటును, ఆప్తాల్మ లజీ శస్త్ర చికిత్స థియేటర్, ఆధునుకరించి, ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు అనంతరం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవిపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు ఈ కార్యక్రమానికి చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మెఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ సురభి, అదనపు కలెక్టర్లు హాజరై జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిపట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అవగాహనతోనే హెచ్ఐవి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చునని ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, జిల్లా వైద్యశాఖ అధికారి శ్రీనివాసులు, వైద్యులు, వైద్య శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా పాలన విజయోత్సవాలు

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి





నవతెలంగాణ- వనపర్తి రూరల్

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజ యోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపా ధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా కలెక్టర్ ఆద ర్శ్ సురభి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానం నుంచి జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో టూ కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చిన్నారెడ్డి , కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ జండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం నుండి ఆర్డీఓ కార్యాలయం మీదుగా తిరిగి బాలుర కళాశాల మైదానానికి చేరుకుంది. ఈ రన్‌లో ద్యార్థులు, యువకులు, పోలీసుల, అధికారులు తదితరులు ఉత్సాహంగా పాల్గొని పరుగులు తీశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నో సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల మన్ననలు చూరగొంటుందని ఆయన అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఈ నెల 9వ తేదీ వరకు రోజు వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అందులో భాగంగానే టూ కేరన్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీవైఎస్ఓ సుధీర్ ఒడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, ఎమ్మార్వో రమేష్ రెడ్డి, ఇతర అధికారుల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూర్: పట్టణంలో సోమవారం మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సి.శశిధర్ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి మున్సిపాలిటీలు ప్లాస్టిక్ కవర్లు వాడటం అమ్మడం నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా అతిక్రమిస్తే 3వేల నుండి 10వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



నవతెలంగాణ- వనపర్తి రూరల్

ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులకు ఆదేశించారు . సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ ఆదర్శ సురభి అదనపు కలెక్టర్ రెవిన్యూ జి.వెంకటేశ్వర్లు ,ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారని ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు .

సమగ్ర కుటుంబ సర్వే డాటా ఎంట్రీ ప్రక్రియ వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎంట్రీ చేయాలని ఆయన సూచించారు. ప్రతిరోజు డేటా ఎంట్రీ టార్గె ట్లు పూర్తి చేయాలని, ఫారాలను చాలా జాగ్రత్తగా భద్రపరచాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పండుగ వాతావరణంలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ అదేశించారు. ఈ నెల 9వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

నూతన కానిస్టేబుల్స్‌కు ఎస్పీ దిశా నిర్దేశం



నవతెలంగాణ -వనపర్తి రూరల్

వనపర్తి జిల్లా నుండి పోలీస్ శాఖకు ఎంపికైన 118 మందిలో 85 మంది సివిల్ కానిస్టేబుల్, ఆర్మడ్ కానిస్టేబుల్,మహిళా కానిస్టేబుళ్లకు ఎస్పీ ఆర్.గిరిధర్ దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, పోలీసులకు ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలందించాలని, వృత్తిపరంగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. వివిధ బాధలతో పోలీస్ స్టేషన్‌కు చ్చే వారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణ ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీస్ శాఖకు పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిన ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తే ప్రజలు ఆదరిస్తారని ఆయన అన్నారు. పైఅధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తు అధికారుల మన్ననలున పొందాలని, అంకితభావంతో సేవలందిస్తూ వృత్తి పరమైన జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆయన కోరారు నేరాల నియంత్రణకు కొత్త టెక్నాలజీ వినియోగంలోకి తెలంగాణ పోలీసులకు మంచి గుర్తింపు ఉన్నదని చట్టబద్ధమైన పౌరులుగా మీ సేవలను చూసి సమాజం గౌరవించేలా ఉండాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ నిబద్ధతతో పనిచేసే పోలీసు వ్యవస్థకు కృషి చేయాలని వనపర్తి జిల్లాకు తెలంగాణ పోలీస్ కు మంచి పేరు తేవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ రాందాస్ తేజావత్, సాయుధ దళాల అదనకు ఎస్పీ వీరారెడ్డి ,రిజర్వు ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు ,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ ,నూతన కానిస్టేబుల్‌లు ,జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

నవతెలంగాణ-వీపనగండ్ల

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీకృష్ణ వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే టీబీ క్యాంపెయిన్ ట్రైనింగ్‌పై వివరించారు. ప్రతి గ్రామంలో పరీక్షలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి చికిత్స అందించాలన్నారు. నెలవారీగా చేయాల్సిన టార్గెట్‌ను పూర్తి చేయాలని, గర్భిణులకు నిత్యం అందుబాటులో ఉంటూ మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రమత్తంగా ఉంటూ వారానికి రెండు రోజులు మంగళ, శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్ హేమవర్ధన్, శ్వేతా, కరుణశ్రీ, భాగ్యశ్రీ, హెచ్ఈ కేశవులు, సీహెచ్ఓ కమలమ్మ విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నవతెలంగాణ - మదనాపురం

మదనాపురం మండలం తిర్మలాయపల్లె గ్రామ శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ని పట్టుకున్నట్లు ఎస్సై శేఖరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మదనాపూర్ పోలీసు సిబ్బంది గస్తీ నిర్వహిస్తుండగా తిరుమలా యపల్లి గ్రామ శివారులోని కేజీబీవీ స్కూల్ దగ్గర ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్‌ను విచారించగా ఎలాంటి అనుమతులు లేనట్లు గుర్తించి ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ రెడ్డి సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నాగర్‌కర్నూల్
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-అచ్చంపేట

గత 18ఏళ్లుగా విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్స్ కన్వర్షన్ జేఏసీ నాయకులు సోమవారం ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వం రెగ్యులర్ కార్మికులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి చేయకుండా మోసం చేసిందని కార్మికులు ఎమ్మెల్యేకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. మా సమస్యలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మమ్ములను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఒక్కొక్క సబ్ స్టేషన్‌లో ఐదుగురు చేయాల్సిన పనిని ఇద్దరూ, ముగ్గురితో చేస్తున్నరని, తప్పనిసరి పరిస్థితుల్లో పనిచేస్తున్నామని కార్మికులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనయ్య, ఆనందంగౌడు, సీహెచ్.వెంకటయ్య, బాల్య, సైదులు, చంద్రశేఖర్‌లు ఉన్నారు.

గైరాను భూములు ధరణిలో నమోదు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ డెస్క్

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రం కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న మాట్లాడుతూ గత ఇందిరమ్మ ప్రభుత్వంలో దళితులకు బడుగు బలహీన వర్గాలకు గైరాన్ భూములు పట్టాలు పంపిణీ చేయడం జరిగిందని, నేటికీ కొంతమంది రైతుల ధరణిలో నమోదు కాలేదన్నారు. కానటువంటి రైతులందరికీ ఆన్‌లైన్‌లో ఎక్కించే విధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. నేటికీ జిల్లాలో గైరాన్ భూములు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో రైతులు క్రాపు లోన్లు, రైతు బీమా, రైతు భరోసా వంటివి అందక చాలామంది రైతులు నష్టపోతున్నారన్నారు. వాళ్ళందరూ ఎస్సీ, ఎస్టీ, బీసీలేనన్నారు. ప్రభుత్వం వెంటనే అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఇందిరమ్మ రాజ్యంలో దళితులకు, బడుగు బలహీన వర్గాలకు పంపిణీ చేసిన భూములు ఆన్‌లైన్‌లో ఎక్కకపోవడంతో రైతులు చాలా నష్టపోతున్నారన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి భూములను పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మన్యం, రాములు, కృష్ణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ వికలాంగుల దినోత్సవం

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ డెస్క్

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10గంటలకు ప్రపంచ వికలాంగుల దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటన తెలిపారు. స్త్రీ, శిశు వికలాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరవుతారని తెలిపారు. నవంబర్ 21న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన వికలాంగుల పాటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధాన చేస్తారని తెలిపారు. కనుక జిల్లాలోని వికలాంగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అక్రమంగా ఇసుక రవాణా



నవతెలంగాణ-తాడూర్

మండల కేంద్రంలో దుందుభి వాగు నుంచి ఇసుక రవాణా రాత్రీ, పగలు తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. ఎన్ని సార్లు జిల్లా, మండల అధికారులకు ఫిర్యాదు చేసిన ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అక్రమ రవాణా చేసే ట్రాక్టర్‌కు ఎలాంటి నెంబర్ ప్లేట్ లేకుండా ఇంజన్‌కు బాడికి సంబంధంలేని వాటితో అక్రమార్కులు ప్రజా ధనాన్ని కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరికి ముట్టే మామూలు వారికి ముడుతున్నాయని, అందుకే ఇలా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక స్పీడ్‌తో వస్తున్న ద్విచక్ర వాహనాలకు సైడ్ ఇవ్వకుండా స్పీడ్‌గా వెళ్లడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నామని ద్విచక్ర వాహన దారులు వాపోతున్నారు. అధికారుల స్పందించి ఇసుక రవాణా ఆపాలని జిల్లా మండలాధికారులను వేడుకుంటున్నారు.

గుండాల ఆలయానికి విరాళం



నవతెలంగాణ-వెల్దండ

శ్రీ గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయం గర్భగుడిలో అభిషేకం మరమత్తు పనులకు కర్నాటి స్వప్న, అనిల్ దంపతులు రూ.84వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న, అనిల్ దంపతులకు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

ఆధ్యాత్మికతతోనే శాంతియుత జీవనం

- వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య



నవతెలంగాణ-తెలకపల్లి

ఆధ్యాత్మికతతో శాంతియుత జీవనం సాధ్యమని సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడుతూ ప్రతివ్యక్తి భక్తి, సేవ, పరోపకారం లాంటి సహకార గుణాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 45 రోజులు కర్ణ కఠోర దీక్షతో చేపట్టిన అయ్యప్ప మాలాధారణ స్వాముల ఇరుముడి కార్యక్రమం గురు స్వాముల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు గురు స్వాములతో కలిసి కేరళ రాష్ట్రంలోని అయ్యప్ప దేవాలయ సన్నిధానానికి బయలుదేరి వెళ్లారు.కార్యక్రమంలో అయ్యప్ప స్వాముల కుటుంబ సభ్యులు, హనుమాన్ మాలాధారణ స్వాములు, బంధువులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-వెల్దండ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 5, 6వ తేదీలలో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి క్రీడా, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ నాయకులు సంతోష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు, హై స్కూల్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్-100మీటర్లు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్-100మీటర్లు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ విశిష్టతను వివరిస్తూ నిజ జీవితంలో రాజ్యాంగాన్ని ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారనే అంశంపైన వ్యాసరచన పోటీ, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. క్రీడా పోటీలలో పాల్గొనేవారు నెంబర్లు 9912252495, 6304226842, 6303390306 పాఠశాలల వారిగా సమాచారం అందజేసి పోటీలలో పాల్గొనాలని కోరారు.రైతు భరోసా ఎక్కడ..?



ప్రజావాణికి 53 దరఖాస్తులు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ డెస్క్

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చొరవచూపి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో బాధితుల నుంచి 53 దరఖాస్తులు తీసుకొని దరఖాసుదారుల సమస్యలపై కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి శాఖలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. శాఖల వారిగా ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కే.సీతారామారావు, దేవ సహాయం, పీడీ డీఆర్డీఏ చిన్న ఓబులేసు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్‌లు యూసుఫ్ అలీ, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

• పోలీస్ ప్రజావాణిలో 8 ఫిర్యాదులు..

పోలీసు ప్రజావాణిలో సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 8 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో తగు న్యాయం గురించి-3, భూమి పంచాయతీలు -5 ఉన్నాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.

పెండింగ్ లెప్రసీ డబ్బులు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు





నవతెలంగాణ-మహబూబ్‌నగర్ డెస్క్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 2 రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో లెప్రసీ సర్వే చేయాలని ఆశలకు జిల్లా అధికారులు చెప్పడం వెంటనే లెప్రసీ సర్వే కోసం ట్రైనింగ్‌లు కూడా ప్రారంభించారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా వైద్యాధికారి స్వరాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2023లో సగం జిల్లాలకు 2024లో మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు ఆశాలు పని చేసిన డబ్బులు 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆశలకు చెల్లించలేదన్నారు. ఈ అంశం పైన కమిషనర్ ఆఫీసులో సంబంధిత అధికారులను మా యూనియన్ ఆధ్వర్యంలో కలిసినప్పుడు రెండేళ్ల సర్వే డబ్బులు మేము రిలీజ్ చేసి చాలా కాలమయ్యింది. సర్వే అన్న ముందే ఈ బడ్జెట్ మేము రిలీజ్ చేస్తున్నామని అధికారులు చెప్పడం, మరి వచ్చిన డబ్బులు జిల్లాలో ఎక్కడికి పోతున్నాయని ఆయన ప్రశ్నించారు. 2024లో చేసిన పల్స్ పోలియో డబ్బులు రాక ఆశలు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. రెండేళ్ల తరబడి చేసిన పనికి డబ్బులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వ మోసం చేస్తూ ఇప్పుడు మళ్లీ కొత్తగా లెప్రసీ సర్వే చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. గతంలో కరోనా సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా ఆశలు ప్రాణాలకు తెగించి పని చేస్తే 16 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ చెల్లించకుండా వచ్చిన డబ్బులను అధికారులు పక్కదారి పట్టించారన్నారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో డబ్బులు వెంటనే చెల్లించాలని, లేదంటే ఈనెల 4న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆశ వర్కర్ల పెద్ద ఎత్తున పాల్గొని పై సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వర్ధం పర్వతాలు, జిల్లా సహాయ కార్యదర్శి పొదీల రామయ్య, జిల్లా కోశాధికారి కొంపల్లి అశోక్, యూనియన్ నాయకురాలు సువర్ణ, మానస, లక్ష్మి, చంద్రకళ, మాణిక్యమ్మ, మమత, నర్మదా, శోభ, కృష్ణవేణి, శ్రీదేవి, అమీనా తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లి పీహెచ్‌సీ ఆస్పత్రి డాక్టర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మంజుల, సుభద్ర, పద్మజ, సునీత, నిర్మల, నాగమణి, హుస్సేనమ్మ సునీత పాల్గొన్నారు.

పెంట్లవెల్లి : ఆశ వర్కర్లకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆశా వర్కర్లతో కలిసి పెంట్లవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ రోహిత్, ఆశా నోడల్ అధికారి వెంకటమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు డి.ఈశ్వర్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, శివలీల, వెంకటమ్మ సునీత, మల్లికాంత, గీత, జ్యోతి, పార్వతమ్మ, పుష్పలత, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి : ఆశ వర్కర్లకు లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ డబ్బులను ఇవ్వాలని జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు కళావతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల పీపీసీ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రాణి, ఆశా వర్కర్లు శివలీల, సుకన్య, రేణుక, సైదమ్మ ఉమా బాయి, మల్లీశ్వరి, సరిత తదితరులున్నారు.



ఖనిజ లవణ మిశ్రమాన్ని ఖచ్చితంగా వాడాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జీవీ.రమేష్



నవతెలంగాణ-కల్వకుర్తి టౌన్

పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే రైతులు తప్పనిసరి ఖనిజ లవణ మిశ్రమాన్ని ఉపయోగించాలని డాక్టర్ జీవీ.రమేష్ అన్నారు. పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వ విద్యాలయం, పశు వైద్య కళాశాల రాజేంద్రనగర్, పశు వైద్య, పశు సంవర్ధక శాఖ, విజయ డెయిరీ ఆధ్వర్యంలో కల్వకుర్తి మండలాలలోని తాండ్ర, జూపల్లి గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో ఆయన పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఎదకు కూడా రాని పశువులకు, చూడి నిలవని పశువులకు, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు, దీర్ఘకాల వ్యాధులు ఉన్న పశువులకు, శస్త్ర చికిత్సలు అవసరమైన పశువులకు నిపుణులైన అధ్యాపకులచే పరీక్షించి చికిత్సలు చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో పశువులతో ఎక్కువగా ఖనిజ లవణాల లోపం ఎక్కువగా ఉంది. కాబట్టి ప్రతి పశువులు కనీసం 50 గ్రాముల ఖనిజ లవణ మిశ్రమాన్ని అందిస్తే పశువులు ఆరోగ్యంగా వుండి, త్వరగా ఏడకు వచ్చి చూడి కడతాయి, పలదిగుబడి పెరుగుతుందని తెలిపారు. పశు వైద్య కళాశాల ఆచార్యులు డా కేసీఎస్.రెడ్డి మాట్లాడుతూ పశువులతో ఈతల మధ్యకాలం తగ్గిస్తే పశువు జీవిత కాలంలో ఎక్కువ పాల దిగుబడి పొంద వచ్చని తెలిపారు. ఈ శిబిరాల్లో 534 పశువులకు గర్భకోస వ్యాధులకు చికిత్స, 92 పశువులకు ఇతర అనారోగ్యాలకు చికిత్సలు, రక్త పరీక్షలు, పేడ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ డా.రమణ, విజయ డెయిరీ డీడీ ధనరాజ్, డా. రాజేష్, నాగరాజ్, శివ, శ్యామ్, వెంకటేష్, ప్రవీణ్, పశు వైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, విజయ డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దండ : రైతులు అప్రమత్తంగా ఉంటేనే వారి పశువులకు రోగాలు దరి చేరవని జిల్లా పశు వైద్యాధికారి జీవీ.రమేష్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొట్ర, తిమ్మినోన్‌పల్లి గ్రామాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశు వైద్యులు శ్యాంసుందర్, ప్రవీణ్, పండిట్ రెడ్డి, కవిత, మురళి, విజయ్, కొట్ర మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రావు, విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్, యాకన్న, ప్రశాంత్ రెడ్డి, శ్రీను, భాస్కర్, రైతులు, పశు వైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, వెంకన్న, ఫనిందర్ రెడ్డి, నరసింహ, శ్రీను, తిరుపతయ్య, బాలు, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన



నవతెలంగాణ-అచ్చంపేట

వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా పట్టణంలో లైన్స్ క్లబ్ ఆఫ్ అచ్చంపేట వారి ఆధ్వర్యంలో సోమవారం ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ తారాసింగ్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన ఉండాలని, బయటి వ్యక్తులతో శారీరిక లైంగిక సంబంధాల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ హన్మంతు, ఏఎన్ఎం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకటేష్, సీనియర్ లయన్ మెంబర్ గోపి శెట్టి, నరసింహా రావు, నరేష్, వాడకట్టు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బల్మూరు : డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని వైద్య సిబ్బంది సూచించారు. ఈ అవగాహన ర్యాలీలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డాక్టర్ ప్రశాంతి, సీహెచ్ఓ విజయ్ కుమార్, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, సూపర్వైజర్ ఉమా, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





అడవుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ టింబర్ డిపోలో అటవీ సిబ్బందికి అడవుల్లో అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లాపూర్ రేంజ్ పరిధిలో అటవీ ఏరియాలలో ఉన్న అన్ని గ్రామాల్లో ముక్కుడిగుండం, మొల్లచింతపల్లి, నార్లపూర్, గేమ్యానాయక్ తండా, ఎల్లూరు, అమరగిరి, సోమశిల, ఎత్తం గ్రామల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక్య కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆదేవిధంగా అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు కాకుండా ప్రత్యేక్య 'ఫైర్ రేస్క్యూ-2 టీం'లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదే విధంగా అటవీ ప్రాంతంలో పశువుల, గొర్రెల కాపరులు ఎవరూ కూడా వెళ్లొద్దని, అక్కడ ఎవరైనా మంటలు పెట్టినచో అటవీ చట్టం -1967 వన్యప్రాణి సంరక్షణ చట్టం -1972 ప్రకారం అటవీకి నిప్పు పెట్టడం నేరం, కాబట్టి అటవీ చుట్టూ ఉన్న గ్రామస్తులు అటవీ సిబ్బందికి సహకరించాలని కోరారు. అదే విధంగా అటవీ ప్రాంతంలో అగ్గిపెట్టెలు కానీ, ఎలాంటి ప్లాస్టిక్ పదార్థాలు తీసుకువెళ్ళరాదని కోరారు. ఈ వారంలో ప్రతి గ్రామంలో అవగహన సదస్సు చేపడతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది ముజీబ్ ఘోరి, కాషన్న, భయ్యన్న, శివ, నీలేష్, జయరాజ్, మల్లేష్, మంజుల, బెట్ అధికారులున్నారు.

ఫ్రూట్స్ అండ్ వెజిటేబుల్ కర్రీస్ ఫెస్టివల్



నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలెంలో ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ కార్వింగ్ ఫెస్టివల్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు వారికి అందుబాటులో ఉండే కూరగాయలు, పళ్ళు, ఆకుకూరల సహాయంతో రకరకాల ఆకారాలను తయారుచేసి ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన వినాయకుడి బొమ్మ, డాల్ఫిన్, రకరకాల చేపలు, ఆక్టోపస్, పక్షుల బొమ్మలు చాలా ప్రత్యేకంగా నిలిచాయి. ప్రదర్శన క్రాఫ్ట్ టీచర్ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రఘునందన్ శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ మైనుద్దీన్, ఉపాధ్యాయులు కృష్ణయ్య, పూర్ణచంద్రకళ, ఎస్వీరాజు, రాఘవేందర్ రెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వ గూనలకు తూట్లు పొడిచిన గుర్తు తెలియని వ్యక్తులు



నవతెలంగాణ-వెల్దండ

మండల పరిధిలోని చొక్కన్నపల్లి గ్రామ సమీపంలో కేఎల్ఐ డీ-82 కాల్వ గూనలకు గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపారాలతో తూట్లు పొడిచారు. దీంతో సాగునీరు వృధాగా పోతున్నాయని స్థానిక రైతులు ఆరోపించారు. గూనలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని రైతులు డిమాండ్ చేశారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు.

డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్



నవతెలంగాణ-తాడూర్

ఖరీఫ్ సీజన్ ముగిసిపోయింది.. రబీ ప్రారంభమై నేలలో గడుస్తుంది.. కానీ నేటికీ ఈ ప్రభుత్వం రైతు భరోసాను వారి పెట్టుబడులు, వ్యవసాయ ఖర్చుల కోసం పురుగులు మందులు, ఎరువులు, పిండి సంచుల కోసం సాయం చేస్తామన్న రైతు భరోసా ఎక్కడికి పోయింది.. నేటికీ అమలు నోచుకోకుండా రైతులు తమర అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ వడ్డీలు కట్టలేక అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొన్నదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి ఏడాది ఎకరాక రూ.5వేల చొప్పున పెట్టుబడుల ఖర్చుల కోసం రూ.10వేలు వేసేది. కానీ ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే చేతల ప్రభుత్వం కాదని, రైతు పక్షపాతి కాదని నిరూపితమైందన్నారు. రెండు లక్షల రుణమాఫీ నేటికీ ఎవరికి చేయలేదని లక్షలున్నర వరకు ఉన్న వారికి కొందరికి మాత్రమే చేసి ముఖ్యమంత్రి, మంత్రులు గాంభీరాలు పలుకుతున్నారని, పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాటల్లో ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం గొప్పలకు పోకుండా అరుగాలం కష్టపడ్డ రైతాంగాన్ని ఆదుకునేటు వంటి చర్యలకు పూను కోవాలని రెండు లక్షల వరకు రుణమాఫీ చేయాలని, తక్షణమే ఖరీఫ్ అలాగే రబీ సీజన్లవి రెండు ఎకరాకు రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇచ్చి ఇతర గ్యారంటీలను అమలు పరచాలని ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాల ని పేదలకు రేషన్ కార్డులు కొత్త పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిహెచ్పిఎస్ మండల అధ్యక్షులు కొట్ర బాలు, ఉపాధ్యక్షులు భగవంతు, ప్రధాన కార్యదర్శి రాము, నాయకులు నరసింహ, వెంకటయ్య, నాగరాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

భజన బృందం సభ్యులకు సన్మానం



వెల్దండ : మండల పరిధిలోని కొట్ర గ్రామంలో కార్తీక మాసం ముగింపు సందర్భంగా భజనకారులకు ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి ముగింపు వరకు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఇక పూజలతో పాటు భజనలు చేసిన భజనకారులకు భక్తుల శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భజన భృందం సభ్యులు గంగోజు రాజు, గంగోజు రామలింగం, ఆర్.సత్యం, ఎ.నాగరాజు, ఆర్.రామాచారి, లక్ష్మ నాచారి, బుచ్చోజీ, పుష్ప, వి.రామస్వామి, ఎస్.రామస్వామి, యు.సత్యం, రామ చంద్రం, శింగోటం తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
నారాయణపేట
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

వైభవంగా అంజన్న బ్రహ్మోత్సవాలు

- కురుమూర్తి, మన్యంకొండ తరహాలో ఏర్పాట్లు
- సీఎం రేవంత్ , మంత్రి కొండా సురేఖలకు ఆహ్వానం
- ఈనెల 13 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు, 15న రథోత్సవం
- మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి



నవతెలంగాణ-మక్తల్

మక్తల్ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను గతంలో ఎన్నడూ లేనంత అంగరంగ వైభవంగా, కురుమూర్తి, మన్యంకొండ జాతర ఉత్సవాల తరహాలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆలయ ధర్మకర్త ప్రాణేశాచారి, ఈవో శ్యాంసుందరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈనెల 13 నుంచి 19వరకు ఉత్సవాలు జరగనుండగా.. 14న ప్రభోత్సవం, 15న రథోత్సవం, 16న పాలఉట్లు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్లు, కర పత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మక్తల్ నలుమూలలా ఉత్సవాల స్వాగత తోరణాలను ఏర్పాటు చేసుకుందామని సూచించారు. మినీ ట్యాంక్ బండ్ నుంచి స్పెషల్ లైటింగ్, ఆంజనేయ స్వామి కటౌట్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతర ఉత్సవాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్యం కోసం ఉత్సవాల కోసం తాత్కాలికంగా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. తాగునీటి కోసం ఇబ్బంది లేకుండా, చుట్టు పక్కల పంచాయతీల నుంచి 30 వరకు ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలన్నారు. జాతర ఉత్సవాల సమయంలో వీధి దీపాలు సరిచూసుకోవాలని, నిమిషం కరెంటు కోతలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంబులెన్సులు సిద్ధంగా ఉంచి, అత్యవసర వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఉత్సవాల సమయంలో ప్రత్యేక ఆర్టీసీ బస్సులు గ్రామాలకు ఉండేలా చూడాలని, ప్రతి బస్సుపై జాతర ఉత్సవాల పోస్టర్లు ఉండాలన్నారు. సీఎం రేవంత్ తోపాటు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఉత్సవాలకు ఆహ్వానిస్తామని అన్నారు. రథోత్సవం ముందు రోజు ప్రభ సందర్భంగా స్వామి వారికి ఈనెల 14న పట్టు వస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు. రహదారుల వెంబడి దుమ్ము, ధూళి రాకుండా నీళ్ల చల్లడం, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడటం, బారికేడ్లు అవసరమైన చోట ఏర్పాటు, గుడికి అడ్డంగా బ్యానర్లు కట్టరాదని తీర్మానించారు. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, స్వచ్ఛందంగా సేవ చేసేవారిని గుర్తించాలని అన్నారు. వీఐపీ దర్శనాలను నిలువరించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బాలక్రిష్టారెడ్డి, లక్ష్మారెడ్డి, కట్టా సురేష్ గుప్తా, ఎ.రవి కుమార్, మల్లికార్జున్, రాజశేఖర్ రెడ్డి, తహసీల్దార్ సతీశ్, ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య, మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, ఎంపీడీవో రమేశ్, విద్యుత్ ఏఈ రామకృష్ణ, డాక్టర్ హబీబ్ , వల్లంపల్లి లక్ష్మణ్, మందుల నరేందర్, ఆలయ అర్చకులు అరవిందాచారి, సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రైతులకు రెండు లక్షలపైన రుణమాఫీ చేయాలి'

నవతెలంగాణ-ఊట్కూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షలపైన ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ చేయాలని జల సాధన సమితి జిల్లా కో-కన్వీనర్ హెచ్.నర్సింహా సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో కూడా వీరికి లక్ష రూపాయలు మాఫీకాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల బాధలు అర్థం చేసుకొని బ్యాంక్‌లో రెండు లక్షలపైన అప్పు ఉన్న రైతులకు న్యాయం చేయాలని అయినా కోరారు.

సుప్రీంకోర్టుకు క్షమాపణ చెప్పాలి




నవతెలంగాణ - తిమ్మాజిపేట

న్యాయస్థానం తీర్పును ఎస్సీ వర్గీకరణపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పునే వ్యతిరేకిస్తున్న మాల నాయకులు మాదిగలను కించపరిచే పద్ధతిని మానుకోవాలని దళిత సంఘాల నాయకులు జోగు ప్రదీప్, దేవస్వామి, పి.స్వామి, వెంకటేష్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మందకృష్ణ నాయకత్వంలో 30ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో ఏనాడు కూడా మాలలను ఆయన కించపరచలేదన్నారు. మొదటి నుంచి రిజర్వేషన్ల ఫలాలు ఒక వర్గానికి చెందుతున్నాయని, తాము ఏ విధంగా నష్టపోతున్నామన్నారు. ఎన్నో సభల ద్వారా ప్రజలకు ప్రభుత్వానికి వివరించడం జరిగిందన్నారు. సుధీర్ఘ ఉద్యమం కాలంలో గ్రామాలలో నూ మాల మాదిగలు సోదరభావంతో కలిసిమెలిసి ఉన్నామని, కానీ ఒకటి రెండు సమావేశాలు పెట్టి మాదిగలను మందకృష్ణను విమర్శించడం తగదన్నారు. మాల సంఘాల నాయకులను ఏనాడైనా మందకృష్ణ విమర్శించిన సందర్భాలు లేవన్నారు. మందకృష్ణను తిట్టడం వల్ల తాము గొప్ప వారం అవుతామని మాల సంఘం నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలోని ఉన్నత న్యాయస్థానం తీర్పును వ్యతిరేకిస్తున్న మాల సంఘాల నాయకులు సుప్రీం కోర్టుకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మాదిగల ఓట్లతో గెలిచిన కొందరు నాయకులు ఒక వర్గానికి కొమ్ము కాయడం ఎంతవరకు సమంజసం అని మాదిగలకు వ్యతిరేకమని తేలిపోయిందన్నారు. ఈ సమావేశంలో అబ్బాసల్లి వెంకటయ్య, శ్రీరాములు, కాళ్ళ రాజు, శివ, జోగు శేఖర్, రమాకాంత్ మల్లయ్య, తదితరులున్నారు.

నిజమైన దేశభక్తులు ఆర్మీ సైనికులే

- జూపల్లి అరుణ్ కుమార్



నవతెలంగాణ - పెద్దకొత్తపల్లి

దేశాన్ని దేశ ప్రతిష్టతను దేశ ప్రజలను సుఖశాంతులతో కాపాడేది దేశ సరిహద్దుల్లో గల ఆర్మీ సైనికులేనని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి తనయుడు జూపల్లి అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన అగ్నిపత్ ర్యాలీకి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్కూల్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీని ఉదయించి చేపట్టిన రన్నింగ్ పోటీలను ప్రారంభించారు. పోటీలలో విజేతగా నిలిచిన షీల్డ్‌లను నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిపత్ ర్యాలీని గత నాలుగు సంవత్సరాలుగా పెద్దకొత్తపల్లిలో నిర్వహించడం గౌరవంగా ఉందని. ఈ అగ్నిపత్ ర్యాలీని నిర్వహించడం తాను చూడడం మొదటి సారి అని, నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించడానికి కృషి చేస్తానని అలాగే తన వంతు సహాయాన్ని కూడా చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై సతీష్ కుమార్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దండు నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తగిలి కృష్ణయ్య, జడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్, సింగిల్ విండో చైర్మన్ బుడుగు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ మెరుగు రాజు, మాజీ ఎంపీటీసీ శశికళ శివశంకర్, పలు మండలాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

శివుని గుట్ట ఆలయ నిర్మాణానికి విరాళాలు..

వెల్దండ : మండల కేంద్రంలోని శివుని గుట్టపై ఆలయాల నిర్మాణానికి వెల్దండ మాజీ సర్పంచ్ రెడ్డి, ఉప్పల సంతోషులు రూ.50 వేల చొప్పున, రంగనాథం రూ 21 వేల విరాళం ప్రకటించారు. శివుని గుట్ట ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు.



ఆశా వర్కర్లకు పెండింగ్ సర్వే డబ్బులు వెంటనే విడుదల చేయాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రాజ్

నవతెలంగాణ-మక్తల్



గత రెండు సంవత్సరాల నుంచి ఆశా వర్కర్లకు లెప్రసీ, 2024 పల్స్ పోలియో పెండింగ్ డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.గత సర్వేల డబ్బులు చెల్లించిన తర్వాతనే డిసెంబర్ 2 నుంచి చేపట్టే లెప్రసీ సర్వేలు ప్రారంభించాలని కోరారు. ఆశలకిచ్చే పారితోషకమే అరకొరగా ఉండగా ఆ సర్వే ఈ సర్వే అంటూ సర్వేల పేరుతో ఆశలతో వెట్టిచాకిరి చేయించుకోవడం తగదన్నారు. కమిషనర్ కార్యాలయంలో అడిగినచో బడ్జెట్ ముందే పంపామన్నారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కర్ని పీహెచ్‌సీ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు యశోద, పీహెచ్‌సీ అధ్యక్షురాలు అమీనా బేగం, సావిత్రమ్మ, శశిరేఖ, సుజాత, రాధిక, గోవిందమ్మ, కే.సుజాత పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలి

- సీఐటీయూ

నవతెలంగాణ-నారాయణపేట



రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది వీఆర్‌ఏలను జీవో నెంబర్ 81, 85 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పే స్కేల్ అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 61 సంవత్సరాలు పైబడిన వారి వారసులకు ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వలేదని ఆ సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు ముందర జరిగిన ధర్నాలో హాజరై ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,797 మంది మిగిలి ఉన్నారని, వారి వారసులకు అర్హత ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జాప్యం చేయడం వలన మాకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా పనిచేస్తున్న మాకు (వీఆర్‌ఏ వారసులకు) తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి.వెంకట్రామ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ ముఖ్యవక్తలుగా హాజరై ప్రసంగించారు. కేసీఆర్ నియంతృత్వ నిరంకుశ పాలనలో వీఆర్‌ఏలకు అన్యాయం జరిగిందని, ప్రజా పాలన అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వీఆర్‌ఏలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏలు చేస్తున్న న్యాయమైన పోరాటా నికి సీఐటీయూ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు బాలప్ప, గోపాల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిలయ్య గౌడ్ హాజరై మాట్లాడారు.ఈ ధర్నాలో నాయకులు భాను ప్రకాష్, బోయ నర్సిములు, అచలానందం, నవీన్‌కుమార్, కె.నర్సిములు, కె.నరేష్, రాఘు వేందర్, నర్సమ్మ, వివిధ మండలాలకు చెందిన 120 మంది వీఆర్‌ఏలున్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో వినతి పత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ ఏవో జయసుధకు ఇచ్చారు.

అంకిత భావంతో పనిచేయాలి : ఎస్పీ



నవతెలంగాణ-నారాయణపేట

9 నెలల శిక్షణ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరుతున్న 78 కానిస్టేబుళ్లకు, 47 మంది సివిల్ కానిస్టేబుల్లకు పోలీస్ స్టేషన్ల వారిగా పోస్టింగ్ ఇచ్చా రు. 31 మంది అర్మడ్ రిజర్వు పోలీసులకు జిల్లా స్పెషల్ పార్టీకి పోస్టింగ్ ఇచ్చి వారికి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భం గా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడమనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశమన్నారు. పోలీసు శాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగ బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుండే ఎన్నో సవాళ్లను ఎదుర్కోం టాడని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని తెలిపారు. పోలీసు శాఖలో ఏ హోదాలో ఉద్యోగంలో చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణలో సమాన ప్రాధాన్యత, బాధ్యత కలిగి ఉంటారన్నారు.నూతన కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారుల నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని, వారి సూచనలకు ఆదేశాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పని చేయాలని సూచిం చారు. నూతన కానిస్టేబుళ్లు అందరికీ వారి వారి శక్తి సామర్థ్యాలకు, విభిన్న నైపుణ్యాలకు తగినట్టుగా అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. రోజు రోజుకీ పెరుగుతున్న సైబర్ క్రైమ్ వంటి సాంకేతికపరమైన నేరాల నేపథ్యంలో అత్యున్నత సాంకేతిక పరి జ్ఞానం ఉన్న వారిని అటువంటి చదువులు చదివిన వారికి సైబర్ క్రైమ్, ఐటి సెల్ వంటి విభాగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నేర నియంత్రణలో శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతి క పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిలో జిల్లలో పోలీ సులు వినియోగిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. బాధతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని, విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్య మివ్వాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్ లాల్, ఎస్బి సీఐ రామ్‌లాల్, ఆర్ఐ నరసింహ, ఆర్ఎస్ఐలు శివశంకర్, రాములు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు..

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల 31 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకుల పై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాల ను, మతాల మధ్య చిచ్చుపెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించి నట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునేఅనుమతులు తీసుకోవాలన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి..

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహిం చే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ పేట జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 అర్జీ దారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగాస్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు. ఎస్పీ ఆఫీస్‌కి, పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే వచ్చి ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలన్నారు.

రూ.6 వేలు మంజూరు చేయాలని వినతి



నవతెలంగాణ-నారాయణపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న కొత్త పింఛన్లు మంజూరు చేయాలని నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి పీఏ సందీప్‌కు డీసీసీ కార్యాలయంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కే.కాశప్ప మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగుల పింఛన్ రూ.6 వేలు పెంచి వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో నవంబర్ 20 నుంచి డిసెంబర్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరి నుండే పెరిగిన పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి 12 నెలలు గడుస్తుందన్నారు. పింఛన్ల పెంపు కోసం 44,49,767 మంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. కొత్త దరఖాస్తు చేసిన 24.84 లక్షల మందికి ఇప్పటికీ పింఛన్ మంజూరు కాలేదు. 2014 రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్లు మంజూరుకు ఆదాయ పరిమితి విధిస్తూ జీవో 17ను విడుదల చేసింది. దీన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. 2015 కంటే ముందు సదరం సర్టిఫికెట్ పొందిన వారి ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకునే అవకాశం లేదు. 2016 కంటే ముందు ఇచ్చిన సదరం సర్టిఫికెట్స్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారాయణపేట మండలం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బసవరాజ్, టౌన్ కార్యదర్శి బాల్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షులు నర్సప్ప, పి.శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్, బీరప్ప, అన్వేష్, సాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి..

- దేవాలయ మాజీ డైరెక్టర్ జయమ్మ యాదయ్య



నవతెలంగాణ - ఊరుకొండ

ఊరుకొండ మండల పరిధిలోని ఊరుకొండ పేట పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో నీటి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని దేవాలయం మాజీ డైరెక్టర్ రాంపురం జయమ్మ యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఊరుకొండ పేట పబ్బతి ఆంజనేయ స్వమి దేవాలయ ప్రాంగణంలో మాజీ డైరెక్టర్ రాంపురం జయమ్మ, యాదయ్య గౌడ్ స్వామి వారి సన్నిధిలో నూతనంగా భక్తులకు దేవాలయం దగ్గర నీటి కొరత లేకుండా బోరు వేయించినట్లు తెలిపారు. స్వామివారి అనుగ్రహంతో మూడు ఇంచుల నీరు రావటం జరిగిందని, భక్తులు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. దేవాలయం సన్నిధిలో ఉచితంగా దాత బోరు వేయడం అభినందనియమని పలువురు తెలిపారు.

దివ్యాంగునిపై.. ఓ ప్రజా ప్రతినిధి దాడి

- స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు రాధిక





నవతెలంగాణ-మద్దూర్

మండల పరిధిలోని ఓ ప్రజా ప్రతినిధి దివ్యంగుని పై దాడికి పాల్పడ్డాడని బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నందిపహాడ్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దివ్యాంగుడైన గుర్రల్లి నరేష్ తండ్రి అంజిలప్పపై అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దాడి ఘటనపై దివ్యాంగుల హక్కుల జాతీయ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షురాలు రాధిక తీవ్రంగా ఖండించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 100శాతం కళ్ళు కనిపించని దివ్యగుడైన నరేష్ పై ఇంత దారుణంగా దాడి చేయడం సబబు కాదన్నారు. ఈ దారుణానికి పాల్పడిన మాజీ ప్రజా ప్రతినిధి, ప్రజ సమస్యలను పరిష్కరించే బాధ్యత కలిగిన ఎంపీటీసీగా పనిచేసిన వ్యక్తే ఇలాంటి దారుణానికి పాల్పడటం సిగ్గుచేటని మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి కేసు నమోదు చేసి బాధితుడికి నాయ్యం చేకూరేలా చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. లేని యెడల వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అందరితో సమాన హక్కు





నవతెలంగాణ-నారాయణపేట

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీనీ డీఎంహెచ్ఓ డాక్టర్ కే.సౌభాగ్య లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని వ్యాధిగ్రస్తుల లాగేనే హెచ్ఐవి, ఎయిడ్స్, వ్యాధి సోకిన వారిని కూడా మనతో సమానంగా చూడాలని, వారి పట్ల ఎటువంటి వివక్ష చూపరాదని అన్నారు. ఎయిడ్స్ వ్యాధి అనునది అసాంఘీక సంక్రమణ వలన, రక్త మార్పిడి వలన సంభవిస్తుంది. అంతేకాని గాలి ద్వారా, చేతులు తాకడం వలన ఈ వ్యాధి రాదని వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్ మాట్లాడుతూ ఆర్టికల్ 21 ప్రకారం, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు కూడా అందరితో పాటు సమానంగా జీవించే హక్కు వారికి కలదని, అందరిలాగే సమాన హక్కు, హెుదా, గౌరవం, అందే విధంగా చూడాల్సిన భాద్యత మన అందరి పై ఉందని సూచించారు. వ్యాధి గ్రస్తుల పట్ల డాక్టర్స్ మరియు ఇతరులు ఏటువంటి వివక్ష చూపరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో డా. శైలజ ప్రాజెక్టు ఆఫీసర్లు డా.జే.సాయిరాం, డా.రాఘవేందర్, టి.బిక్షపతి డీపీఓ, శ్రీనివాసులు ఐసీ డీఈఎంఓ, శ్రీధర్ ఎస్‌టీఎల్ఎస్, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, పీపీ యూనిట్ సూపర్ వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశలు, ఐసీటీసీ ఉద్యోగులు, ఎన్జీవో ప్రతినిదులు ఓఆర్డబ్ల్యూ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూర్ : మండల కేంద్రమైన ఊట్కూర్ లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ హెచ్ఐవీ/ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓఎమ్ఐఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ హాజమ్మ మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌నీ అందరం కలిసి కట్టుగా నిర్మూలించాలని సూచించారు. హెచ్ఐవీ టెస్టులు ప్రతి ఒక్కరు చేసుకోవాలని హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, కలుషిత రక్తమర్పిడి, సిరంజీల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. హెచ్ఐవీ సోకిన వారినీ వారి పట్ల వివక్షత చూపరాదన్నారు. ఏఆర్‌టీ మందుల ద్వారా వ్యాధి తగ్గుటకు చర్యలు తీసుకోవచ్చున్నారు. సమాజంలో అందరు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం మానసిక ఆనందం కలిగి ఉండాలని కలుషితమైన ఆహారం తీసుకోరాదని హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యక్తులపట్ల సానుకూలత వ్యక్తం చేసి మానసిక ఆనందం కలిగించే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో. ఓఎంఐఎఫ్ మండల కో-ఆర్డినేటర్ నర్సింలు, ఆరోగ్య కార్యకర్తలు రజనీ, సుకన్య,





ఉమా, జ్యోతి, వర్ష ప్రవీణ, మంగమ్మ అంజమ్మ, వాలంటీర్ అశోక్, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జోగులాంబ-గద్వాల
మంగళవారం | డిసెంబర్ 03, 2024 | www.navatelangana.com

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి

• కలెక్టర్ బీ. ఎం సంతోష్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావులతో కలిసి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజ ల నుంచి మొ త్తం 40 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణి అనంతరం ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రచురించబడిన మాదక ద్రవ్యాల నిర్మూలన గోడపత్రికలను సంబంధిత జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజ్ తో కలిసి ఆవిష్కరించారు. ఇట్టి గోడ పత్రికలన జిల్లాలోని అన్ని కళాశాలలో అతికించారు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

• డీఎంహెచ్వో డాక్టర్ ఎస్కే సిద్ధప్ప



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిద్దప్ప ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులచే ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మై, తదితర ప్రోగామ్ ఆఫీసర్లు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కాలుష్యం నుంచి ప్రాణాలను రక్షించుకోవాలని పర్యావరణం, మానవ ఆరోగ్యంపై దాని దుష్ప్రభావాలపై అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకుంటారనీ, డిసెంబర్ 2, 3, 1984 రాత్రి సంభవించిన భారతదేశ చరిత్రలో అత్యంత దారుణమైన పారిశ్రామిక విపత్తులలో ఒకటైన విపత్తు భోపాల్ గ్యాస్ విషాదానికి ముఖ్య మైన అంశాని వివరిస్తూ విపత్తులను నివారించడానికి, మెరుగుపరచడానికి నిరంకుశ చర్యల అవసరాన్ని పర్యావరణ క్షీణతను తగ్గించే చర్యలను ప్రోత్సహించాలన్నారు. వాయు కాలు ష్యం, నీటి కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, పారిశ్రామిక భద్రత, ప్రజల అవగా హన ప్రచారం, చెట్లను నాటే డ్రైవ్‌లు చేపట్టాలని సూచించారు. జాతీయ కాలు ష్య నియంత్రణ దినోత్సవం 2024 యొక్క ప్రాథమిక లక్ష్యాలు అవగాహన పెంచడం, గాలి, నీరు, నేల కాలుష్యం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలపై పౌరులకు అవగాహన కల్పిం చడం, పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలను ప్రోత్సహించడం, ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం, పర్యావరణ అనుకూల సాంకేతికతలు స్థిరమైన అభ్యాసాల వినియోగాన్ని ప్రోత్సహించడం, చట్టాలను పటిష్టం చేయడం, ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షించడానికి భారతదేశంలో కాలుష్య నియంత్రణ చట్టాలను కఠినంగా అమలు చేయడానికి మద్దతు ఇవ్వడం లాంటివి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జీ. రాజు, డాక్టర్ రిజ్వానా తస్వీర్, జిల్లా డీపీహెచ్ఎన్ఓ వర లక్ష్మి, డీడియం రాము, డివిఎల్ఎం నరేంద్ర బాబు, ఆఫీస్ సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు,డీఈవోలు ,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి



నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలో ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 5న జరిగే స్వామివారి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శివాలయ ధ్వజస్తంభ ప్రతిష్టతో పాటు గోపురం మహాకుంభాభిషేకం, మహా రుద్రాయాగం కార్యక్రమాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా యాగశాల ప్రవేశం, దేవత ఆహ్వానం , కలశ ,ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం వ్యవస్థాపక వంశీయులు కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో స్తంభాద్రి దేవస్థానం పండితులు వాసుదేవా చారి , రమేష్ తదితరులు పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈనెల 5న మంత్రాలయ పీఠాధి పతులు 1008 సుబుదేంద్ర తీర్థ స్వామి హాజరుకానున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ పదవ తరగతికి.. అడ్మిషన్ చేసుకోండి

నవతెలంగాణ - గట్టు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎవరైనా ఓపెన్ 10వ తరగతి 2024 25 సంవత్సరం గాను 10వ తరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్ పొందే విద్యార్థులకు స్పెషల్ అడ్మిషన్ అపరాధ రుసుంతో ఈ నెల రెండు 12 నుంచి 11వరకు పొడిగించినట్లు జిల్లా పరిషత్ పాఠశాల ఇన్చార్జి ఎంఈఓ నల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం సహాయం నిధి చెక్కు అందజేత



నవతెలంగాణ - ధరూర్

కే.టీ దొడ్డి మండలంలోని గువ్వలదిన్నె గ్రామానికి చెందిన అరుణకు సీఎం సహాయం నిధి నుంచి మంజూరైన చెక్కును సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి కుటుంబసభ్యులకు అందజేశారు. సీఎం సహాయం నిధి కింద రూ.18,000 వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురమన్న, మల్లేష్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

2024 విద్యా సంవత్సరానికి గాను విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే మైనారిటీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్ , సిక్కులు, జైనులు , పార్సీలు) ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం కింద స్కాలర్షిప్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ (ఇంజినీరింగ్) లో 60శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయుటకు, పీజీలో 60శాతం మార్కులు వచ్చి డాక్టరేట్ (పీ హెచ్ డీ) చేయాలనుకునే విద్యార్థులు ఫాల్ సీజన్- 2024 (01.08.2024 నుండి 31-12-2024)వరకు విదేశీ యూనివర్సిటీలో ఎంపిక చేయబడి అడ్మిషన్ పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఆన్లైన్ వెబ్సైట్ www. telenganaepass. cgg.gov.in నందు ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సాయంత్రం 5:00 గం. లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్ లైన్ చేసిన దరఖాస్తులను 25-01-2025 లోపు జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ కార్యాలయం ఎఫ్-8 మొదటి ఫ్లోర్, ఐడీఓసీ కాంప్లెక్స్‌లో సమర్పించాలని సూచించారు. మిగితా వివరాలకు 8099059007 నెంబర్ ను సంప్రదించగలరని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నిధులు లేకుండా వైద్యసేవలు ఎలా సాధ్యం : సీపీఐ(ఎం)



నవతెలంగాణ - ధరూర్

ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణకు అవసరమైన నిధులు, విధులు నిర్వహించే సిబ్బంది లేకుండా నాణ్యమైన వైద్యం అందించడం ఎలా సాధ్యమని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ ప్రశ్నించారు. సోమవారం మండలంలోని వివిధ పీహెచ్ఎస్సీ లు సబ్ సెంటంలలో ఉన్న సమస్యలపై రోగులు, స్థానిక ప్రజలు,వైద్య సిబ్బందితో మాట్లాడి సర్వే నిర్వహించి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప్పేర్ పీహెచ్ ఎస్సీ రోజుకు 70 నుండి 80 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నప్పటికీ వైద్య సిబ్బంది, మందుల కొరత కొరణంగా నాణ్యమైన వైద్యం అందడం లేదని అన్నారు. అందుబాటులో ఉన్న ఆయుర్వేద ఆసుపత్రిని సైతంఎత్తివేసారని అన్నారు. ఆసుపత్రిలో జనరేటర్ లేదని, నైట్ వాచ్ మెన్ లేరని, ఆక్సిజన్ ప్లాంట్ సైతం రిపేర్ లో ఉందని అన్నారు. సీసీ కెమెరాలు ఉన్న పని చేయడం లేదని ప్రహరీ గోడ, ఆసుపత్రి గేట్లు రిపేర్‌లో ఉన్నాయని అన్నారు. కరెంట్ బిల్లు కూడా దాదాపుగా రూ.15000 పైగానే పెండింగ్‌లో ఉందని అన్నారు. వర్షం వస్తే .. పలు చోట్ల ఆసుపత్రి కారుతుందని అన్నారు. ప్రహరీ గోడ సక్రమంగా లేకపోవడంతో అప్పుడప్పుడు విష పురుగులు ఆసుపత్రిలోకి వస్తున్నాయని అన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త పరీక్షలు సరిగా నిర్వహించడం లేదని, రంగన్న అనే రోగికి 4 తేదీ నాడు పరీక్ష కోసం రక్తాన్ని తీసుకొని ఇప్పటివరకు రిపోర్టు ఇవ్వలేదని అన్నారు. ఆస్పత్రిలో డెలివరీలు తక్కువగా ఉండటంతో మాతా, శిశు సంరక్షణ కిట్లు కూడా వృథాగా పడి ఉన్నాయని అన్నారు. ఆసుపత్రికి దాదాపు 165 రకాలకు పైగా మందులు అవసరం ఉండగా కేవలం 65 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అన్నారు. చింత రేవులలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రిపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో తక్కువ సంఖ్యలో రోగులు వస్తున్నారని అన్నారు. ఇక్కడ స్వీపర్ పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న భవనానికి బదులుగా నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు . ఆసుపత్రి నిర్వహణకు ప్రత్యేక నిధులు ఏమి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధరూర్ పీహెచ్‌సీ కి రోజుకు 80 నుంచి 100 మంది ఔట్ పేషెంట్లు వస్తుంటారని, రోగులకు 120 రకాల మందులు అవసరం ఉండగా కేవలం 95 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఆక్సిజన్ ప్లాంట్ లేదని మూడు లక్షల కరెంట్ బిల్లు పెండింగ్లో ఉందని, రెండు ఫ్యాన్లు రిపేర్‌లో ఉన్నాయని, ఇన్వెటర్ కూడా రిపేరులో ఉందని పేర్కొన్నారు. ఇక్కడ కూడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదన్నారు. ధరూరు పీ.హెచ్.ఎస్.సీ లోనే నేచురోపతి ఆసుపత్రి కూడా ఉందని, నేచురపతికి ప్రత్యేకంగా భవనం లేదని అన్నారు . నెట్టెంపాడు, ద్యాగదొడ్డి , మన్నాపురం గ్రామాలలోని పల్లె ఆసుపత్రులు తాము పరిశీలన చేసిన సందర్భంగా తాళాలు వేసుకుని ఉన్నాయని అన్నారు. ద్యాగదొడ్డి గ్రామానికి ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని భూమి పూజ కూడా చేశారని, నిర్మాణం పూర్తి చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించకపోవడం, వైద్య సిబ్బంది కొరత, మందుల కొరత, మరుగుదొడ్లు, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, మంచినీరు ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. సర్వేలో వచ్చిన సమస్యలపై దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడ్తామన్నారు.

ఈ సర్వేలో సీపీఐ(ఎం) మండల నాయకులు మోష , ప్రవీణ్ , తిమ్మప్ప , నరసింహ , వినయ్ , ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ కుమార్, డీవైఎఫ్ఐ నాయకులు ఉప్పేర్ అంజి , భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యం

• ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

చివరి ఆయకట్టుకు సాగు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల పట్టణ సమీపంలోని సంగాల రిజర్వాయర్ నుంచి బండ్ల కృష్ణ మెహన్ రెడ్డి కృష్ణమ్మ తల్లికి పూజలు నిర్వహించి నీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని , అదేవిధంగా రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యంను ప్రభుత్వమే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రైతుల అభివృద్ధికి రైతుబంధు , రైతు రుణమాఫీ , సున్న కారు రైతులకు రూ.500 బోనస్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గద్వాల మండలంలోని పలు గ్రామాలకు అదేవిధంగా గద్వాల పట్టణానికి కూడా సంఘాల చెరువు నీటిని ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు ప్రతి సన్నకారు రైతులకు సాగు నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. రైతులు నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్ , మాజీ జెడ్పీ చైర్మన్ బం డారి భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, కాంగ్రెస్ సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ఎర్రవెల్లి మండలం బీచుపల్లి గురుకుల పాఠశాలను బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సి పాల్ గేటుకు తాళం వేయడాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా గురుకుల బాట ఇన్చార్జి మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థి సంఘాల నాయకులను లోపలికి పోకుండా తాళాలు వేయించడం సిగ్గుమాలిన చర్య అన్నారు.కేసీఆర్ పాలనలో గురుకులాలు స్వర్ణయుగంగా విరజిల్లాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గురుకులాలు ఫుడ్ పాయిజన్‌తో విలవిలలాడుతున్నాయన్నారు.శాంతి యుతంగా, సామరస్యంగా గురుకుల పాఠశాలలకు వెళ్లి సమస్యలు తెలుసుకునే సందర్భంగా గురుకుల పాఠశాల గేట్లకు తాళాలు వేయడం దుర్మార్గ మన్నారు. నీవు నిర్బంధించిన మాత్రాన మా పోరా టం ఆగదు నువ్వు చేసే పాపాలను ప్రజలకు విప్పి చెపుతామన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా పాఠశాలల ప్రిన్సిపాల్ లు లోపల నుంచి బయటకు వచ్చి, గేటు బయటనే మమ్మల్ని నిలబెట్టి మాట్లాడమంటే రేవంత్ రెడ్డి భయపడుతున్నట్టేనన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో విలువలు ఆడుతూ.. ఈ రాష్ట్రంలో 48 విద్యార్థులను పొట్టన పెట్టుకున్న దుర్మార్గుడు రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఈ 11 నెలల పాలనలో గురుకుల పాఠశాలల్లో సాంఘిక సంక్షేమ హాస్టల్ లో మరియు మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల పరిస్థితి చూస్తా ఉంటే అగమ్యగోచారం కన్నీళ్లు వస్తున్నాయన్నారు. గురుకుల పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నీటి వసతి లేదు, నాణ్యమైన భోజనం లేదు, కిటికీ లు లేవు, కిటికీలకు జాలిలు లేవు, అద్దె భవనాలకు రెంటు కట్టే పరిస్థితిలో లేరన్నారు. వసతులు కల్పించే వరకు రేవంత్ రెడ్డి పైన పోరాటం చేస్తూనే ఉంటాం అని హెచ్చరించారు. బీచుపల్లి గురుకుల పాఠశాలలోని విద్యార్థులు తాగానీరు లేక రెండు రోజులకోసారి స్నానం చేయడం దుర్మార్గం అదేవిధంగా కాంపౌండ్ వాల్ సరిగా లేక లోపలికి పందులు వస్తున్నాయని, రూముల్లోకి పాములు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. అక్కడున్న స్టాఫ్ ప్రిన్సిపాల్ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బయట చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కూరగాయలు మొత్తం కుళ్లిపోయినవి ఉన్నవి, ఉల్లిగడ్డలు కూడా మురిగి పోయినాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గం నాయకులు మాజ్, మండల అధ్యక్షులు మత్తాలి, మాధవ్, రాజు, రామకృష్ణ, బసిర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : ఎస్పీ



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ ,ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు సేవలు అందించాలనీ జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ట్రైనింగ్ పూర్తి చేసుకొని కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు దిశానిర్దేశం చేశారు. జోగుళాంబ గద్వాల్ జిల్లా నుంచి 72 (మహిళలు - 25) సివిల్, 33 ఏఆర్ (మహిళలు - 5) కలిపి మొత్తం 105 (మహిళలు - 30) మంది సెలెక్ట్ అయి 9 నెలల కఠినమైన పోలీస్ శిక్షణ పూర్తి చేసుకుని జోగు ళాంబ గద్వాల జిల్లాలో విధులు నిర్వహించడానికి రావడం జరిగినందున సోమవారం ఎస్పీ జిల్లా పోలీస్ కార్యాలయం లోని గ్రీవెన్స్ హాల్‌లో వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. పోలీసుశాఖ మిగిలిన ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే ఎంతో భిన్నమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలని సూచించారు. ప్రతి పోలీసు ఉద్యోగ బాధ్యతల్లో చేరిన మరుక్షణం నుంచే ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని శాంతి భద్రతల పరిరక్షణ కోసం అనుక్షణం పాటుపడతాడని పేర్కొన్నారు. నూతన కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారుల నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని, వారి సూచనలకు ఆదేశాలకు అనుగుణంగా క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. నూతన కానిస్టేబుళ్ల అందరికీ 15 రోజుల పాటు రైటర్ , కోర్టు డ్యూటీ, భరోసా, సఖి, షీ టీం, రిసెప్షన్, బీట్ సిస్టం, వెహికల్ చెకింగ్, కార్డన్ అండ్ సెర్చ్, డయల్ -100 కాల్స్ అటెండ్, ఔట్ డోర్ ట్రైనింగ్, బందోబస్తు జిల్లా పోలీస్ కార్యాలయం లోని వివిధ విభాగాలలో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రికార్డు వర్క్ నేర్చుకోవాలని, అలాగే అన్ని వర్టీకల్స్ పై అవగాహన కలిగి ఉండాలనీ అన్నారు. 15 రోజుల ట్రైనింగ్ అనంతరం వారి వారి శక్తి సామర్థ్యాలకు, విభిన్న నైపుణ్యాలకు తగినట్టుగా వివిధ పోస్టులలో అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. కాలానుగుణంగా నేరాల తీరు మారుతుందని, ప్రస్తుతం సైబర్ క్రైమ్, డ్రగ్స్ నేరాలు పెరిగాయన్నారు. నేర నియంత్రణలో శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నత స్థాయిల జిల్లలో పోలీసులు వినియోగిస్తున్నారని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. జిల్లా కు కొత్త బ్యాచ్ రావడం వాళ్ల పోలీస్ ఇంప్రోవింగ్ పెరిగిందని అధికారులకు తెలిసేల విధులు నిర్వహించాలని, 100శాతం కమిట్మెంట్‌తో భాధ్యతగా విధులు నిర్వహించాలని అన్నారు. బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని , విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. పోలీసు శాఖలో పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ఎంపిక చేయబడిన ప్రతి ఒక్కరూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. అధికారులు అప్పగించిన బాధ్య తలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పోలీసులకు ప్రధాన బాధ్యత ప్రజల రక్షణ అని, వారి హక్కులకు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రజలతో మంచి నడవడికను అలవాటు చేసుకోవాలని చెప్పారు. మీరు పోలీస్ కాక ముందు బాధితుడికి పోలీస్ ఎలాంటి న్యాయం కావాలని ఆశించారో ఇప్పుడు మీ నుంచి బాధితులు ఆ విధంగా న్యాయం కావాలని ఆశిస్తారని వాటిని నెరవేర్చే విధంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ కె.గుణ శేఖర్, ఆర్.ఐ వెంకటేష్, ఎస్పీ ఎస్సై శ్రీనివాస్,ఆర్ ఎస్సై చంద్ర కాంత్ తదితరులు పాల్గొన్నారు.

బైకుల దొంగతనం కేసును.. ఛేదించిన గద్వాల పోలీసులు

• ఆరుగురు నిందితుల అరెస్టు
• రూ.లక్షల విలువజేసే 35 బైకులు స్వాధీనం
• ఎస్పీ శ్రీనివాసరావు



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

పరిచయం ద్వారా స్నేహితులు అయి ఒక ముఠాగా మారి రాత్రి సమయాల్లో కాలనీలలో రెక్కి నిర్వహించి ఇండ్ల ముందు నిలిపిన బైక్ లను దొంగతనం చేసి తీసుకెళ్లే ముఠాను గద్వాల పోలీసులు ఛేదించి 6 గురు నిందితులను ఉదయం 5 గంటల సమయంలో అరెస్టు చేసి వారి నుంచి దొంగ లించిన 35 బైక్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కేసు వివరాలు నవంబర్ 28,2024న జీ. రేణుక హరిజనవాడ, రాంనగర్ గద్వాల టౌన్ మహిళా గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. తేదీ 13.11.2024న రాత్రి సమయంలో తమ ఇంటిముందు పార్కిం గ్ చేసిన యమహా ఫాసినో స్కూటీ ని ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దొం గలించారని, బైక్ విలువ దాదాపు రూ.40 వేలు ఉంటుందని, తమ బైకు దొంగలించిన వ్యక్తులపై చట్టరీత చర్య తీసుకోవాలని గద్వాలటౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గద్వాల టౌన్ ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముద్దాయిల వివరాలు..

గాంధీ చిన్న ,గ్రామం చింతల పేట, గద్వాల్, నాగరాజు గ్రామం చింతల పేట, గద్వాల్, వంశీ రెండో రైల్వే గేట్, గద్వాల్, రఫీ నల్లకుంట గద్వాల్, నవీన్ దంతనూర్, మదనాపురం మండలం, వనపర్తి జిల్లా, వహీద్ కొత్తకోట, వనపర్తి జిల్లా, ఆదర్శ్ కొత్తకోట, వనపర్తి జిల్లా, రాధాకృష్ణ మదనాపురం మండలం, వనపర్తి జిల్లా. గతంలో నమోదైన కేసుల వివరాలు..

గద్వాల్ టౌన్ లో గతంలో నమోదైన 7 బైక్ దొంగతనం కేసులలో నిదితులుగా గుర్తించడం జరిగింది.

నేరం చేసిన విధానం..

పరిచయం ద్వారా స్నేహితులు అయి ఒక ముఠాగా ఏర్పడి రాత్రి సమయాల్లో కాలనీలలో రెక్కి నిర్వహించి ఇండ్ల ముందు నిలిపిన బైక్ లను దొంగతనం చేసి తక్కువ ధరకు అమ్ముకొని అట్టి డబ్బులతో జల్సాలు చేయడం వీరి పని, వీరిలో కొందరు బైక్ లు దొంగతనం చేయగా మిగిలిన వారు వాటిని కలెక్ట్ చేసుకొని అమ్మి వచ్చిన డబ్బులు పంచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. గద్వాల్ ఫిర్యాది బైక్ సంబంధించి ఏ-1 గాంధీ చిన్న ,ఏ-2 నాగరాజు, ఏ-3 వంశీ , ఏ-4 రఫీ ఈ నలుగురు రెండు బైకులపై అర్ధరాత్రి వేళ కాలనీలలో రెక్కీ చేస్తూ హరిజనవాడ రామ్ నగర్ లోని జీ. రేణుక ఇంటి ముందున్న యమహా ఫాసినో స్కూటీని మాస్టర్‌కి తో అన్ లాక్ చేసి స్కూటీని దొంగలించి అట్టి స్కూటీనిఏ-5 నవీన్‌కు రూ. 20వేలకు విక్రయించారు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు

రూ.30 లక్షల విలువజేసే 35 బైకులు

నేరాన్ని ఛేదించిన విధానం..

టీ శ్రీనివాసరావు, ఐపీఎస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జోగుళాంబ గద్వాల జిల్లా వారి ఆదేశాల మేరకు.. జిల్లా అదనపు ఎస్పీ శ్రీ కె.గుణ శేఖర్ సూచనల తో కె. సత్యనారాయణ డీఎస్పీ,టీ. శ్రీను సీఐ గద్వాల స్వీయ పర్యవేక్షణలో కళ్యాణ్‌రావు గద్వాల టౌన్ ఎస్ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి తేదీ 02.12.2024 ఉదయం 5గంటల సమయంలో గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక వ్యక్తి బైక్ పై అనుమానస్పదంగా రావడం గమనించి అట్టి బైక్ పై వస్తున్న వ్యక్తిని ఆపి వాహనం పత్రాలు చూపించమని అడగగా అతను తన దొంగతనం చేసిన ఒప్పుకొని ఇతర నేరాలు కూడా ఒప్పుకున్నడు. అతనితోపాటు ఇంకో ముగ్గురు వ్యక్తులు కలిసి బైక్ దొంగతనాలు చేసిన తర్వాత వాటిని అమ్మేవారని చెప్పి వీళ్ల చేసిన ఇతర దొంగతనాలు వివరాలు చెబుతూదొంగతనం చేసిన బైక్లను చూ యించారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. వారిని కూడా త్వరలో పట్టుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇట్టి వ్యక్తుల నుంచి 35 బైకులను రికవరీ చేయడం జరిగిందని, వీటి విలువ దాదాపు రూ. 30 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసును ఛేదించడం లో ప్రతిభ చూపిన టౌన్ ఎస్సై కల్యాణ్ రావ్, సిబ్బంది చంద్రయ్య పీఎస్-3221, ఇస్మాయిల్ పీసీ-3220లనుక్యాష్ రివార్డ్‌తో ఎస్పీ ప్రత్యేకంగా అబినధించారు.

తిమ్మప్ప స్వామికి గోపురకలశాల వితరణ

నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం గోపురాలకు కీ శే సింగనేడు ఈరమ్మ బూద య్య జ్ఞాపకార్థం వారి కుమారులు జ్యోతి, నర్సింహయ్య, పావని, నర్సింహయ్య , మల్దకల్ వాస్త వ్యులు రూ.1లక్ష విలువ చేసే ఆలయ గోపుర 10 కలశాలను సోమవారం ఆలయ అర్చకులు రమేష్ ఆచారి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో బస్టాండ్ నరేందర్, కంసాలి కృష్ణ, నరేందర్ గౌడ్, చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

